# భారతనారి

★

శ్రీమతి వట్టికొండ విశాలాక్షి

ఇప్పుడు ఇంతకాలానికి భార్య చనిపోవటం, తల్లి మంచానపడటం, మళ్ళీ పెళ్ళిచేసుకుందామన్నా కానిపరిస్థితులు రావటం ఏ టన్నిటి మూలానా నన్ను రమ్మని చెప్పంపుతున్నారే కాని ఇంతకు ముందెప్పుడైనా రమ్మన్నారా? ఎక్కడ గతిలేనప్పుడు నేను కావలసివచ్చా నన్నమాట. నేనుమాత్రం మనిషిని కాదు? నాకుమాత్రం మానాభిమానాలు లేవా? నాకైనా జ్ఞాపకశక్తి అనేది పూర్తిగా నశించలేదే! వారు చేసినవన్నీ ఎలా మరచిపోగలను? కష్టాలవల్ల మనస్సెంత పాడైపోయినా బాధలుమాత్రం తప్పకుండా జ్ఞాపకం ఉంటవి. ఒకసారి నెళ్ళగొట్టిన తరువాత మళ్ళీ ఆ భర్తతో కలసి ఉండటం మాటలా? ఒకవేళ మనం తలవంచుకున్నా లోకం తలవంచగలమా? ఇప్పుడు కూడా లోకానికి హేళనగానే ఉన్నప్పటికీ కనీసం కష్టపడుతున్నాననే సంతృప్తిఅయినా ఉంటుంది. మళ్ళీ మేము కలిసిఉంటే ఎంత అసూయతో ఎంత వేధించాలని చూస్తుందీ లోకం? లోకంమాట అలా ఉంచి ఎవరైనా ఒకరకమైన జీవితానికి అలవాటుపడిన తరువాత మళ్ళీ ఇంకొక రకమైన జీవితాన్ని గడపాలంటే ఎంత కష్టమో ఆలోచించండి. దుస్తులు మార్చుకున్నంత తేలికగా పూటకొకరకమైన జీవితానికి అలవాటుపడలేము. ఏదోవిధంగా గతాన్ని విస్మరించి అక్కడకు వెళ్తానే అనుకోండి. అప్పుడు మాత్రం వారు నన్ను అక్కడే ఉంచుకుని సుఖపెడతారని ఏమిటి నమ్మకం? అంతే! అవసరమయితే తిరిగిరావటానికి కూడా సిద్ధపడే పోవాలన్నమాట. తెలిసి కూడా నే నీపని చేయలేనబ్బ. పోనీ మరల ఆ దాస్యకూపంలోపోయి పడేకంటే అంత తిండిలేకపోతే పదిమంది చిన్నపిల్లలకు చదువు చెప్పుకోనైనా బ్రతుకుదాం లెమ్మనిపిస్తుంది, ఒకొకసారి. కాని ఇదివరకు బ్రతికిన బ్రతుక్కి చిన్నపిల్లలకు చదువుచెప్పుకోని బ్రతకటమా? అది మాత్రం తోటి నలుగురిలో తేలిక కాదు? పాతబాధలను భరించలేను. కొత్తబాధల కంతకంటే అలవాటు పడలేను. అయినా మరల అక్కడకు వెళ్ళి ఆ బాధలనుభవించేకంటే ఈ బాధలకే ఒప్పుకొని ఇక్కడే ఉండటానికి నిశ్చయించుకుందామంటే ముందు మా అన్నయ్య ఊరుకుంటాడా? తను నన్ను బాగా పోషించినా లేకపోయినా తన భార్యకు పిల్లలకు చాకిరీచేస్తూ మెదలకుండా ఇంట్లో పడుండమంటాడు. లేకపోతే మాట్లాడకుండా అక్కడికే వెళ్ళమంటాడు. అంతేగాని నేను వేరేవుండి నా అంతట నేను స్వతంత్రజీవనం గడుపుకోవటానికి ఆయన అంగీకరించలేడు. అదంతా ఆయనకు తలవంపులుగా వుంటుంది.

ఏమిటోనబ్బ! మన భారతనారీమణులను గురించి మనదేశ నాయకులంతా పెద్దపెద్ద ఉపన్యాసా లిస్తుంటారుగాని అదంతా ఎంతవరకు నిజమంటారు? 'మా భారత నారీమణులు ప్రపంచనారీలోకాన్ని తలదన్నగల సౌశీల్యాన్ని పొందిఉన్నారని పూర్వంనుంచీ కూడా అలాంటి సాంప్రదాయాన్నే పాటిస్తూవచ్చారనీ.........' అంటారు. అదొక్కటేనా? మా భారతదేశపుస్త్రీలు విదేశాంగరాయబారులుగా ఉన్నారనీ, మంత్రులయారనీ, ఇంకా ఏమేమో చెప్తారు. కాని ఈ చెప్పేదంతా మన భారతదేశపు స్త్రీలకు ఎంతమందికి వర్తిస్తుందనేదే కొంత హృదయంలో బాధిస్తుంటుంది. పైన మన దేశనాయకులు చెపుతున్నదంతా వర్తించే స్త్రీలు మనదేశంలో వేళ్ళమీద లెక్కపెట్టతగినంత మందికన్నా ఎక్కువ ఉండరు. ఏ ఒక రిద్దరినిబట్టో దేశం మొత్తం ఆ విధంగా ఉన్నదనుకోవటం ఎంత అన్యాయం? సామాన్యస్త్రీ సమాజమంతా ఏవిధంగా ఉన్నదో ఎవరివరకు వారు తమ జీవితాన్ని పర్యాలోకించుకుంటే చాలదూ?

ఎక్కడిదాకానో ఎందుకు? నావరకు నన్ను చూడండి. నేను పుట్టటమే అంతమంది ఆడపిల్లల మధ్య పుడితిని. పైగా మా నాన్నగారిది అంత స్థితి గల సంసారంకూడా కాదు. నేను పుట్టి భూమిమీద పడినప్పటినుండీ ఇంతే ననుకోండి నా కష్టాలు. అలాంటి పరిస్థితుల్లో నన్ను బాగ చదివించి విజ్ఞానవంతురాలను చేయాలనిగాని, మంచి సంబంధం తెచ్చి వివాహం చేద్దామనిగాని అనుకోటానికి అవకాశం లేదుగదా? నిజంగా నేను చిన్నప్పుడు ఎంత చురుగ్గా ఎంత ఉత్సాహంగా ఉండేదాన్ననీ. మా అన్నయ్య ఉండేవాడా ఆయన్ను నాకంటే రెండు సంవత్సరాలుముందు బడిలోకి పంపించినా ఆయనకంటే తరువాత పోయినదాన్ని నేనే చదువులో ఎంతో ముందుకు పోతుండేదాన్ని. అయినప్పటికీ మగపిల్లవాడు ఒక్కడేకదా ఆయన్నే కొస్త అభివృద్ధిలోకి తీసుకువస్తే బాగుంటుందని వచ్చినా రాక పోయినా అవి అమ్మి ఇవి అమ్మి ఆయన చదువుకోసమైనా ఖర్చుపెట్టారుగాని నాకుమాత్రం చదువు చెప్పించలేదు. పెద్దదాన్నయిన తరువాత లోకంలో నలుగురితోపాటు ఎలాగు మంచి సంబంధం రావటం కష్టమని తలిమ్మాలేవీ చూచుకోకుండా మాకంటే కొస్త ఆస్తివిషయంలో పరవాలేదులెమ్మని ఇచ్చివేశారీ సంబంధానికి. మాకంటే తాము పెద్ద భాగ్యవంతులమనీ, తమకు తగినట్లుగా మేము చూడలేక పోతున్నామనీ పెళ్లయిన మరుసటిరోజునుంచి మా అత్తగారు ఎప్పుడు సాధిస్తూనే ఉండేది. కొడుకు కూడా ఆ అమ్మమాటలకు తల ఊపటమే కాని మా పరిస్థితులు సరీగా అర్థం చేసుకోగలిగేవారు కారు. అక్కడికీ మావాళ్లు వాళ్ళకున్నంతలో మా అక్కచెల్లెండ్రందరినీ సమానంగానే చూస్తూఉంటూ ఈ రోజువరకు. నిజం చెప్పవలసివస్తే వీళ్ళ ఒత్తిడికి తట్టుకోలేక నాకే కొంచెం ఎక్కువగా ముట్టచెపుతూ ఉంటారు. అయినా వారికి సంతృప్తిలేదు. ఆ పని చేతగాదని ఈపని చేతగాదని నన్నూ, దానిమీదగా అది పెట్టలేదని ఇది పెట్టలేదని మా వాళ్ళనూ ప్రొద్దస్తమానము తిట్టి పోస్తుండటమే పని. నిజంగా అదేమిటోగాని నన్ను నిలువునా నిలబెట్టి వెయ్యి తిట్టినా ఏదో ఒకవిధంగా సరిపెట్టుకుపోయేదాన్ని కాని మావాళ్లను మాత్రం ఒక్కమాటన్నా, తరవాత నాకెంత కష్టమైనా రానీ, ఆ క్షణానమాత్రం సహించగలిగేదాన్ని కాదు. దాని మీదట తగాదా ఇంకా పెద్దదవుతుండేది.

నాకు సాధారణంగా ఇక్కడ జరిగే తగాదాలు పుట్టినింట్లో చెప్పే అలవాటుండేది కాదు. కాని కొత్తగా కాపురానికివెళ్ళి పుట్టింటికివచ్చిన రోజుల్లో మావాళ్లు నన్ను మరీ గుచ్చిగుచ్చి అడుగుతూఉంటే ఎప్పుడోఒకసారి మాటల సందర్భంలో కొంచమైనా చెప్పక తప్పేదికాదు. అప్పుడు మా అమ్మ అనేది 'మమ్ములను అంటే నీకెందుకు రోషం? నీవు మాట్లాడకుండా వూరుకో. మా ఎదుటమాత్రం అనరుగదా? ఒకవేళ అంటే మేమే చెపుతాం జవాబు. నీ ఎదుట ఏదన్నా అన్నా గానీ నీకు పట్టనట్లుగా ఊరుకో, అంతగా అయితే, నా ఎదుట అంటే ఏం ప్రయోజనం మా వాళ్ల ఎదటనే అనరాదా? అను. నీకు రోషం అని తెలిస్తే వాళ్లు ఇంకా ఎక్కువ జేస్తారు. నీకు పట్టనట్లుగా వూరుకుంటే అనీ అనీ వాళ్లే వూరుకుంటారు.' మా అమ్మ నాకీ విధంగా చెప్పటం నాకెంతో బాధగా ఉండేది. నేను తమకోసం అని నాకు ఎక్కువవుతున్న కష్టాలను కూడా సహిస్తూ తమమీద మాటపడకుండా కాపాడుతుంటే చివరకు ఇదేమిటా ఇలా అయిందనిపించేది. ఆమె అలా చెప్పటంలో అభిప్రాయం మంచిదే కావచ్చు. తమ మూలాన నేనేవిధమైన కష్టాలు పడకుండా ఉండటానికే కావచ్చు. కాని నేను సహించేదెట్లా? నేను మా తల్లితండ్రుల మెప్పు పొందటంకోసమని ఆవిధంగా రోషానికి పోతే అనుకోవచ్చు, అలాకాదుగదా? నిజంగా ఎంతో బాధపడే ఆ విధంగా వాళ్లను ఎదుర్కొనటం, మనం అత్తగారింటికి పోయి అక్కడ మన జీవితాన్ని వాళ్లమీద ఆధారపడి గడుపుతూ ఉంటాం కాబట్టి సమంజసమైనా కాక పోయినా మనల్ని ఒక మాట అనే అధికారం వారికి గాని పడవలసిన బాధ్యత మనకుగాని ఉంటుంది. ఏదో వాళ్ళకున్నంతలో కలో గంజో తాగి వాళ్లంతట వాళ్లు బ్రతుకుతున్నప్పుడు అనవసరంగా మాటిమాటికీ వాళ్లను తూలనాడుతూ ఉంటే ఏస్త్రీఅయితే మాత్రం ఎలా సహిస్తుంది? ఎంత ఈ రోజు ఒకళ్ల చేతుల్లో పెట్టినా మనలను పుట్టినప్పటినుండీ పెంచి పెద్దవాళ్లను చేసింది తల్లితండ్రులే కదా. మన ఉనికి ప్రారంభంనుంచీ కూడా వాళ్లను చూచి సంతోషిం

చటం కానీ, వాళ్లవల్ల సుఖపడటం కాని, ఒకటేమిటి జీవితానికి కావలసిన సమస్తము వాళ్లవల్లనే కదా సమకూరింది. మనకు ఇంకొక రకమైన మనుష్యులతో పరిచయం కలగగానే ఇంకొక ఇంట్లో అడుగుపెట్టగానే పూర్వ సంస్కృతులన్నీ ఒక్కసారిగా మరచిపోవాలంటే సాధ్యమా? 'నీకెందుకు నీకు పట్టనట్లుగా ఊరుకో' అని మా అమ్మచెపుతుండే కాని నా క్షేమం కోరి అదెలా చెయ్యగలం? ఆమె నాకు చెపుతుండే కాని మేమంతా ఇంత మందిమి పెరిగి పెద్ద వాళ్లమైనా ఈ రోజుకీ కూడా మా నాన్న ఏదైనా తమాషాకు మా అమ్మ— పుట్టినింటివారి నేదైనా అంటే ఆమెకే ఎంతో కోపం వస్తుంది. నిన్న గాక మొన్న కాపురానికి వెళ్లిన నాసంగతి చెప్పే దేమున్నదింకా?

మా వూరికీ వారి వూరికీ చాలా దూరం కావటానో ఏమో వారి పనులు, ఆచార వ్యవహారాలు, అభిప్రాయాలు అన్నీ మార్పుగానే వుండేవి. మేము సాధారణంగా అంట్లు తోమినా, అన్నాలువడ్డించినా కూర్చోనే చేస్తాం. మా అత్తగారు అలాకాదు. ఆమె అలాంటిపనులన్నీ వంగోని చేస్తూ వుంటుంది. నన్ను ప్రతిసారీ హెచ్చరిస్తూనే ఉండేది. 'ముసలమ్మవా ఏం కూర్చోని చేయటానికి'? అని ఒకొక సారి చాలా గట్టిగా కోపంగా కూడా చెప్పేది. కాని నా కెందుకో అలా వంగోని అంట్లు తోమబోయినా అన్నాలు వడ్డించబోయినా వీలుగా ఉండేది కాదు. చూడటానికి కూడా అదొక తరహాగావుండేది. నేను మార్చుకోలేకపోయేదాన్ని, తనకు పని కావటం ప్రధానం గాని ఇవన్నీ ఎందుకా అని చాలా విసుగ్గావుండి 'మా వూళ్ళో అందరం ఇలాగే చేస్తాం' అని చెప్పేదాన్ని ఒకొకసారి. 'మీ ఇంట్లో ఏ అలవాటైతే ఆ అలవాటేనా ఏం, మార్చుకో నక్కర్లేదా?' అని కొడుకుకూడా నన్నే కసిరేవారు. దాదాపు ఇంట్లో ప్రతి చిన్న విషయం వారికి పట్టనిదంటూ వుండేదికాదు. ప్రతిదీ పట్టించుకోవలసిందే. తీర్పేమో తల్లివైపు. అక్కడ నా అన్నవాళ్లు ఎవరు లేకపోవటాన నా విషయం ఎవ్వరికీ తెలిసేది కాదు. వీలైనంతవరకు ఇంట్లో తగాదాలు బయటకు పొక్కనిచ్చేవాళ్లం కాదు. ఆవిషయంలో మాత్రం అందరం ఒకటిగానే నడుచుకునేవాళ్లం. మేము పైకి అంతగా పోట్లాడుకోకుండా వుండటం ఇరుగుపొరుగువాళ్లకు ఏమంత బాగా వుండేదికాదు. మా తగాదాలను రెచ్చగొట్టటానికి వాళ్ల సర్వ శక్తులను ధారపోస్తుండేవాళ్లు. నన్ను ఒకటి రెండుసార్లు కదలించి చూచారు కాని లాభంలేకపోయింది. మా అత్తగారి దగ్గర మాత్రం కొన్ని కొన్ని పనిచేస్తూ వుండేవి. అదంతా గ్రహించి ఎక్కువగా నేనే సరిపెట్టుకు పోతుండేదాన్ని.

ఒక పండుగకు ఇళ్ళలుక్కుంటున్నాము. పొరుగింటామె ముగ్గు గొట్టంకోసమని వచ్చి 'కోడలు వచ్చినా ఇంకా మా వదినకు అలకటం తప్పలేదే' అన్నది.

'ఆఁ తప్పద్ది, ఆడకు పోయిన్నాడే తప్పేది' అన్నది మా అత్తగారు. పోనీ నేను వూరికే కూర్చుంటే ఆ పొరుగింటామె అలా ఆమాట అన్నా ఈమె విసుక్కున్నా కొంత అర్థం ఉన్నది. నేను అడ్డాలు సర్దను, ముగ్గు వెయ్యను, కందిముంతల మంట పెడుతూ ఒకదాన్నే వంట చెయ్యటం, ఈలోగా ఎవరైనా వస్తే అన్నాలు వడ్డించటం ఆమెకంటే నాలుగువంతులు నాకూ పని ఎక్కువగానే ఉన్నది. అంతకంటే ఇంకా నేను మాత్రం ఏమి చేయగలను. నేనూ మనిషినే కదా. ఎంత పనిచేస్తున్నా మాకోడలికి అన్నం వండటం కూడా చేతగాదు. అని ప్రచారం చేస్తుండేది మా అత్తగారు. ఎప్పుడైనా అలా కొంచెం బయటకు పోతే సరి 'అన్నం కూడా వండవటకదా? ఏం జేస్తావు!' అని అడిగేవాళ్లు నన్ను ముఖానపట్టుకుని. కోపంవచ్చి ఆమె నన్ను ఏపనీ చెయ్యనివ్వదు. ఆమే చేసుకుంటుంది అని చెప్పేదాన్ని, మొదట. తరువాత నిజమే చెప్పేదాన్ని లేండి. తిన్నదానికి సరిపోను వీలైనంతవరకు బండచాకిరిచేయించుకుందామనే దృష్టి తప్ప ఈ మనిషి ఎంతవరకు చేయగలుగుతుందా, ఏయే పనులు చేయగలుగుతుందా, అనే ఆలోచనే వుండేది కాదామెకు. మాపుట్టినింటివాళ్లు ఎక్కువ భాగ్యవంతులు కాకపోయినా బస్తీకి పక్క వూరు కావటానో ఏమో వడ్లు దంచుకునే అలవాటే లేదు. మాకు మాకే కాదు మా వూళ్ళో మాకంటే తక్కువ పరిస్థితుల్లో వున్నవాళ్ళకుకూడా ఆ అలవాటే లేదు. అందువల్ల నాకు రోకలి ఎలా పట్టుకోవాలో కూడా

తెలిసేదికాదు. ఎప్పుడైనా పండుగలకు పిండి కావలసివస్తే మరన వేయించుకొస్తుంటేవాళ్లు మావాళ్లు. ఎప్పుడైనా ఒకోకసారిమాత్రం ఇంటి దగ్గరనే పిండికొడుతుంటే వాళ్లు. పూర్వం పోటు వేసిన అలవాటువల్ల మా అమ్మ, అక్కయ్యలు కొట్టేవాళ్లు. సరదాకు నేను కూడా పోయి రోకలి తీసుకుంటే నాలుగుపోట్లు వేయగానే ఎంతో సొలి వచ్చేది. వెంటనే నీకు చేతగాదులే ఎవరిచేతిమీద నన్నా వేసేవు రోకలిఅంటూ, నా చేతులో రోకలి తీసుకునేవాళ్లు. అలాంటిదాన్ని అత్తవారింటికి వెళ్లగానే వడ్లుదంచమంటే ఏమి దంచగలుగుతాను ?

నేను అత్తవారింటికి వెళ్లిన రెండవసారే యిరవై రోజులకు పదిపద్దెనిమిది మానికలు వడ్లు గుంటలోపోసి రోకలి తీసుకోమన్నది నన్ను, మా అత్తగారు తనొక రోకలితీసుకుని దంచుతూ. నా గుండెల్లో గుభేలు మన్నది. నేను వడ్లు దంచాలి. నిర్ఘాంతపోయి స్తంభాని కానుకుని అలాగే నిలబడ్డాను. అట్టానుంచుంటా వేమే? నీకు కాదూ చెప్పేది రోకలి తీసుకోమని? అన్నదామె. ఇక నీ విషయంలో నోరుమూసుకొనివుంటే లాభంలే దనిపించింది. అలాగే ధైర్యం తెచ్చుకుని గోళ్లు గిల్లుకుంటూ ఆమె ముఖంవైపు చూడటానికి కూడా భయమేసి తలవంచుకునే నాకు చేతగాదు అన్నాను. 'అదే చేతనాద్దిలే. తీసుకో. తీసుకో.' అన్నదామె మళ్ళీ. ఆచేతులోకీ ఈ చేతిలోకీ రోకలి గబగబా మార్చుకుంటూ, కాలితో వడ్లు గుంటలోకి ఎగదోసుకుంటూ. అంతటితో నాలో అదివరకుఉన్న ఓపిక కూడా పోయినట్లయింది. రోకలి తీసుకోబోతే చేతులకు నరాలుగాని ఎముకలుగాని వున్నట్లు తోచ లేదు. తప్పేదిలేదని ఉన్నవాటిల్లోకి చిన్నరోకలి ఏరి తీసుకున్నాను. ఒక వరసకూడా పూర్తిగా వెయ్యకముందే విపరీతంగా సొలివచ్చి రోకలి దింపాను. కొంచెం ఆగి కొంచెంసేపు, మళ్ళీ కొంచెం ఆగి కొంచెంసేపు వేస్తూవుంటే మొదటి సారి వేసినంతసేపు కూడా ఒక్క బిగువున వెయ్యలేకపోతున్నాను. నోరు ఎండిపోయి మంచినీళ్లు త్రాగటం జాస్తిఅయినకొద్దీ అసలు రోకలే నా స్వాధీనంలో లేకుండాపోయింది. ఇక ఏమైనాసరే లెమ్మని చేతిలో రోకలి గోడకు ఆనించిపెట్టి అరుగు కానుకుని కూర్చున్నాను.

'ఇట్లా కూర్చుంటే ఇక నాడే నలిగినట్టే ఒడ్లు' అన్నదామె.

'అయితే ఏంజేయమంటారు? నా కసలే అలవాటు లేదు' అన్నాను. అరిచేతులు ఊదుకుంటూ.

'ఇన్నాళ్లనుంచీ జీతగాడూ నేనూ దంచిపోసిన బియ్యంవుంటే తిని కూర్చుంటిరి మరి. ఎల్లకాలం అట్టెట్టా అమురుద్ది కూర్చోని తినటానికి. అలవాటు లేదంటే అలవాటుచేసుకోవాల. మా అందరికిమాత్రం పుట్టంగానే అలవాటైందా? ఇట్టాగే ఎయ్యంగా ఎయ్యంగా అలవాటైంది. నీకూ అంతే—' అని ఆమె అంటూండగానే జీతగాడు వచ్చాడు. 'ఇయ్యాళ చిన్నదొరసానిగారి చేత ఒడ్లు దంపిత్తన్నట్టుందారే—' అన్నాడు వాడు నా వాలకం చూచి.

'ఆఁ దంపిచ్చం ఆమెనీ నిన్నూ కూర్చోబెట్టి పెడ్తాం. మిమ్మల్నందర్నీ కూర్చోబెట్టి మేము తెచ్చిపెట్టలేమయ్యా, ముందు నువ్వుకూడా రోకలి తీసుకో గబగబ ఒక వరసవేసి తరవాత కూడు తిందువుగాని—' అంటూ ఆమెకూడా రోకలి గోడకు ఆనించి పెట్టి వడ్లగుంట చుట్టూ ఊడుస్తూ లేవమ్మ లే లే అన్నది. నేనుకూడా ఒకసారి చేతులు చూచుకుని రోకలి తీసుకున్నాను.

'అబ్బ' దొరసానిగారి చేతులు ఎఱ్ఱగా ఎట్టా కందిపొయ్యినయ్యో చూడు పెద్ద దొరసానీ. పాపం బొబ్బలుకూడా పొక్కినియ్యి. అమ్మో అయ్యగనక చిటికితేనా? ఇకాబాద బగవంతుడికి దెలియాల్సిందే. అయ్య చిటికితే ఇక రోకలి పట్టుకోటానికే యీలుగాదుగా?—అన్నాడు వాడు. నేను అలాగే పోటు వేస్తూనే ఉన్నాను.

'ఊఁ యీలుగాదు కొట్టుద్ది మా కందరికీ పొక్క లేదంటావా? అయ్యేం జాస్తయ్యేం? రొండు మూడు రోజుల్లో కాయలు గాసిపోతై, తరవాత ఇక బాదే తెలవదు.' అన్నదామెకూడా రోకలి తీసుకుంటూ.

'అయినా ఇసుమంటి పన్లు మాబోటి మోటోళ్ళం చెయ్యాల్సిందే కాని మీబోటి దొరసాన్లు చెయ్యలేరులేండి. నాకెందుకు చెప్తారు...అన్నాడు వాడు ఉసిగా ఒక చేతులోనుంచీ ఇంకొక చేతిలోకి రోకలి మార్చుకుంటూ.

'ఏం? మీబోటి దొరసాన్లంటే. మేము మాత్రం తినట్లేదా? మీరేనా తింటుంది? పొట్ట

లున్నంతవరకి ఎటువంటి దొరసాన్లకైనా తప్పదు ఎటువంటి దొరగార్లకైనా తప్పదు.' అన్నదామె.

'అయినా ఎనకటి కాలపోరు మీబోటోరు; ఏరు. ఈకాలప దొరసాన్లు ఏరులెండి. మామట్టికి మాలోనే ఎంతో తేడా వుంటది—ఎనకటోళ్ళకీ ఇప్పటోళ్ళకీ మా సెల్లెల్నొకదాన్ని పరమటిచ్చాం. ఏదో పొలము బుట్రావుంది ఒకళ్ళకి కూలికిబోకండా వాళ్ల పొలాల్లో వాళ్ళేసేసుకు బతుకుతారు గదా అని. వాళ్ల పొలం వాళ్లు ఊడ్చుకుపోను. జైజ్జావ గోంగోర తప్ప రొండోగి నోట్లో బెట్టుకోటానికి దొరకదు. ఆరుగాలం అదే. ఆ తైదలు అయినా ఆరుగాలం ఎంత శాకిరీజేస్తే వస్తై. ఇప్పుడు బుట్టిన పిల్లనైనా సరే ఇట్టా దోలానికి దుప్పటికట్టి ఆ దుప్పట్లో పడేసి పొలాని కురికితే మళ్ళీ యింటికొచ్చే ఆ బిడ్డని జూసుకునేది. లేకపోతే ఒడిగట్టుకోనైనా బయలేరాల. పొలం తీసకపోయి అక్కడ ఏ చెట్టుకొమ్మకో ఒక సైపంచ కట్టేదీను ఆ పంచలో పారేసి అంతకంటే ఇంకా కొత్తె వుహ తెల్చిన పిల్లల్ని కాపలా పెట్టేదీ, మనం పొలం పన్లో పడేది. ఆడ్డోళ్లు మొగోళ్లు ఆ మాదిరిగా కట్టపడితేగాని ఆ తైదజావకూడా దొరకదు. మా చెల్లెలు మా అన్నదమ్ములముద్దెన ఒక్కతే కాటాన కొత్తె పొలము బుట్రా పంపకుండా గారాబంగానే పెంచాం శెప్పొద్దు. ఎటొచ్చీ ఇక్కడ కొత్తె సుకపడిపోయిందాయ. అక్కడ రెయ్యింబవళ్లు పొలానికి తరిమి ఎట్టిశాకిరీ అంతా శేయించేటప్పటికే పన్నాశిది కాకైపోయిందిగా. అంతకిముందు మాలో కందల్లోకీ అదే కొత్తె సాయంగా వుండేది. ఇప్పుడేముంది? మామాత్రం అన్నాలేదుగా? ఈ దొరసాన్ని జూసినప్పుడల్లా నాకదే మనసులో కొత్తుంటది—అంటూ వాడుకూడా పోటుచాలించి చమట తుడుచుకుంటున్నాడు. నేను కొంచెంసేపు వేసి మధ్యలో ఎప్పుడో చాలించి వాడిమాటలు వింటూ అలాగే రోకలిపట్టుకొని నిలబడిఉన్నాను.

'ఏమమ్మ అట్టాగే నుంచుంటివేం ఇందాకట్నుంచీ' అన్నది మా అత్తగారు. 'వా రూళ్లో ఇసుమంటి పనులన్నీ ఎరగర్లేండి, ఆ దొరసానేమెత్తది పాపం. గబగబ నేనే రెండుమూడు వరసలేసి పోతా'—అన్నాడు.

నువ్వు జేసేపని నువ్వు జేసేదుద్దూ. నువ్వు కూడా ఇంట్లోపను లెక్కడ సవిరిస్తా కూసుంటావు. ఇక పదయిపోయి అన్నంతిని ఇంకొకతట్ట పచ్చిగడ్డి తీసుకురా—అన్నదామె. వాడు అన్నం తిని పచ్చిగడ్డికి వెళ్లాడు. బొబ్బలు చితికి చేతులుమంటలు పుడుతున్నా అట్లాగే ఆ ఒడ్లు బియ్యంచేశాం. ఆ రోజు మొదటిరోజునే కాదు నా చేతులకు బొబ్బలు పొక్కటం. ఎప్పుడు దంచినబియ్యం అయిపోయి మళ్లీ వడ్లుపోసి దంచబోయేటప్పటికీ ఎప్పటికప్పుడు కొత్తగా బొబ్బలు పొక్కవలసిందే. ఆ బొబ్బలు చితికిన చేతులతోనే వడ్లు దంచవలసిందే. ఆమె చెప్పినట్లు కాయలుకాచినా బాగానే ఉండేది. ఎన్నిసార్లు దంచినా, నా చేతులు కాయలుకాచేవి కావు, ఎందువల్లనో మరి. మరీ ఆ వడ్లదంపుకు తట్టుకోలేక ఎప్పుడు మా యింటికి వెళ్దామా అనిపించేది అక్కడ వుండగా. మా యింటికివస్తే అక్కడికి వెళ్ళటం అంటేసరి భయంగా వుండేది.

చేయించుకున్నప్పుడు అలా చాకిరీ చేయించుకున్నా తీరిక సమయంలోనైనా ఎక్కడికైనా పోనిచ్చేవాళ్లా అంటే అదీలేదు. వూళ్లోనే సభలనీ, అవనీ ఇవనీ ఏవైనా జరుగుతుండేవా? ఎక్కడికీ పోనిచ్చేదికాదు. ఎక్కడికి వెళ్తే ఎవరు ఏమి నేర్పి పంపుతారో, ఎక్కడమాట వినకపోతుందోనని భయపడుతుండేవాళ్లు. ఏవైనా ఊరేగింపులవీ వచ్చేవా కొంచెం వాకిట్లోకివెళ్లి చూద్దాం అంటే వీలుపడనిచ్చేది కాదు. సరీగ్గా ఆ బజార్లోకి వచ్చేటప్పటికీ 'పాలు పొంగిపోతవి పాలు చూస్తుండు' అనో, ఏదో ఒకటి అలాంటి పనులే నాకు అప్పజెప్పి తనింకే పని మీదనన్నా అక్కడ లేకుండా వెళ్లిపోయేది. అబ్బ చెప్పుకుంటే ఒకటా రెండా ఇలాంటివెన్నైనా వుంటవి.

ఆ వూళ్ళో మహిళాసంఘం వున్నది. బయటకువచ్చి పనిచేయగలిగినవాళ్లు ఆ వూళ్లో అన్నివేల మందిలో ఇద్దరుమాత్రమే ఉన్నారు. వాళ్లు మమ్ముల్ని కూడా మహిళాసంఘంలో చేర్పించాలని వచ్చారొకరోజు. ముందు మా అత్తగారి నడిగారు. మనకు ఆ కష్టాలున్నై ఈ కష్టాలున్నై. ఇవన్నీ పోవాలంటే మనం అంతా ఒక సంఘంగా ఉంటే మంచిదనిచెప్పి ఆమెను సంఘంలో చేరమన్నారు.

'మాకు సంగాలు వద్దు, ఏమీ వద్దు మమ్మల్నిట్టావుండనియ్యండమ్మా చాలు—అన్నదామె.

'మీ కిష్టం లేకపోతే మీరు చేరవద్దులెండి, మీ కోడల్ని అయినా చేర్పించుకుంటాం' అన్నారు వాళ్లు.

'మా కోడలొకటీ నేనొకటీనా ఏం? నేనే చేరకపోతే మా కోడలెట్టా చేరుద్ది? బలేవాళ్ళే మీరు, ఇవాళ సంగంలో చేరమంటారు, రేపు మీ మాదిరిగా ఇల్లిల్లు పట్టుకుని తిరగమంటారు. మా కయిన్నీ ఏం తెలవవులే పోండి. పోండమ్మా' అన్నది; ఆమె విసురుగా. పాపం వాళ్ళేమనుకున్నారో ఏమో తెల్లపోయి.

అలా కోపపడితే ఎలాగండీ. మాకుమాత్రం ఏం పనిపాటల్లేక ఇలా తిరుగుతున్నామంటారా? ఇప్పుడు ఇంటికివెళ్లి మీలాగానే మీ కోడలిలాగానే అన్నిపనులు మేమే చూచుకోవాలి. ఇంకా కొంత కాలం పోతే ఇలా అనేవాళ్ళే ముందుముందుగా చేరుతారు లెండి' అని నావైపు ఒకసారిచూచి వాళ్లు వెళ్ళిపోయారు. ఎప్పుడైనా మహిళా సంఘానికి చందాలు అవీ కావలసివస్తే మా యింటిదగరనుంచీ దేనికైనా వాడు కోవటానికని తీసుకువెళ్లిన డబ్బులోదే అప్పుడప్పుడు ఒక రూపాయి అర్ధరూపాయి ఇస్తూ ఉండేదాన్ని. అది నా డబ్బేఅయినప్పటికీ మళ్ళీ మా అత్తగారింట్లో ఎవ్వరికీ తెలియకుండా చాలా రహస్యంగా ఇస్తుండేదాన్ని. మనకు అభిమానం ఉన్న సంఘానికి మనడబ్బు మనం ఇచ్చుకునే అధికారంకూడా లేదన్నమాట. ఒక సంఘానికే కాదు. నా కవసరమైన ఖర్చులకు వాడుకుంటున్నా కూడా వారందరికీ కష్టంగానే ఉండేది అదేమిటో మరి. ఎప్పుడైనా పూలవ్వి వస్తే పిలిచి తీసుకుంటుంటే 'ఇవాళ ఏం పేరంటం వచ్చిందనో, ఏదన్నా పండగా పబ్బమా? అవి నాలుగు అయిపోయినదాకా అంతేలే' అని తనలో తనే గొణుగుకుంటుండేది. పెండ్లై ఇన్ని సంవత్సరాలైనా వారి డబ్బు దేనికి ఇవ్వకపోగా నాడబ్బు నన్నుకూడా సంతోషంగా స్వేచ్ఛగా ఖర్చుపెట్టుకోనిచ్చేవాళ్లు కాదు.

ఒక డబ్బేమిటిలే. కాస్త శుభ్రంగా వుంటే కూడా చూడలేకపోయేవాళ్లు. సాధారణంగా వారానికొకసారి తలంటుకోవటం అలవాటు నాకు. ఇంత తొందరగా ఎందుకు అంటుకోవాలా? అని కోపం చూపిస్తూ ఉండేదామె. కుంకుడుకాయలు కొట్టుకుంటుండేదాన్నా? 'తెచ్చిపోస్తావుంటే కొట్టిపోస్తా వుండండి. మీ దేంపోయిందిలే. అన్నిటికీ నేనుండగా?' అనేది. అలా ఒకసారా రెండుసార్లా? ప్రతి తలంటుకీ ఏదో ఒకమాట మార్పుతో మొత్తంమీద తలెందుకు అంటుకోవాలా? అనే భావాన్నే సూచిస్తూవుండేది. అక్కడికీ వారానికొకసారి అంటుకునే అలవాటును పది పదకొండు రోజులవరకు కూడా మార్చుకున్నాను. అంతకన్నా ఇంకా నేను చేయగలిగే దేమున్నది? ఆమె కసలు నన్ను చూస్తూవుంటేనే ఎప్పుడు ఏదో ఒకటి అన బుద్ధి అవుతూనే ఉండేది.

ఒకసారి ఇంట్లో బియ్యము పప్పు అన్నీ అయిపోయేవి. అయిపోయిన సంగతి మా యిద్దరికీ తెలుసు. అయిపోయినవని చెప్పబోతే 'అయిపోతే నన్నేం చేయమంటావు?' అనేది. అందుకని ఒకసారి పైపనంతా చేసి పొయ్యి రాజెయ్యకుండా కూర్చునేదాన్ని. 'చేతులు ముందుపెట్టు కూర్చున్నారేం? తినరా? అనేది. 'పొయ్యిమీద ఏం పెట్టేది మరి?' అనేదాన్ని. ఏమో ఏమి పెడతావో. కాజేసుకు కూచున్నవాళ్లు ఎరగరా?' అంటూ చేట తీసుకుని పొరుగింటికి పోయేది. ఎక్కడన్నా బదులు తీసుకొస్తాను పొయ్యి రాజేసి ఉంచమని చెప్పటానికి కాబోలు ఈ ఉపోద్ఘాతమంతా అనుకుని పొయ్యి రాజేసేదాన్ని. ఇలాంటివి ఒకటా రెండా ప్రతి దినము ఎన్నో సంఘటనలు జరుగుతుండేవి.

మన బంగారం మంచిదైతే కంసాలి ఏం చేయగలడని ఒక సామెత. అలాగే అసలు చేసుకున్నవాళ్లు మంచివాళ్లైతే అత్తలు ఆడబిడ్డలు ఏం చేయగలుగుతారు? వాళ్ళ అలవాట్లప్రకారం కొన్ని కొన్ని మాటలు అంటున్నా చేసుకున్నవాళ్లైనా ఆదరంగా చూస్తూవుంటే వాళ్లను చూసైనా కొంతవరకు మరచిపోవటానికి వీలుంటుంది. ఇప్పుడు వచ్చిన బాధలన్నీ చేసుకున్నవాళ్ళ దగ్గరనుంచే ప్రారంభమైనవి. అసలే అంతంత మాత్రపు సంసార మనుకోండి. దానికి తగ్గట్టూ పొలము బుట్రా కూడా చూచుకోకుండా,

ఏదో మక్తాలకు ఇచ్చుకుంటే వచ్చే ఆదాయాన్ని కూడా ఇంట్లోకి సరీగ్గా ఇవ్వకుండా చీట్లాటలకనీ, వాటికనీ, వీటికనీ అన్ని దురభ్యాసాలకు ఖర్చుపెట్టుకుంటూ పైగా తమలోవున్న బలహీనతలను ఇతరులలో కూడా వెదకచూడటం, ఎవరు ఏది చెపితే అదంతా కూడా నిజమేననుకోవటం, ఇంట్లోఉన్న కాసేపు నాతో పోట్లాడుతూ కూర్చోవటం. ఇదంతా అత్త, ఆడబిడ్డలకు మాత్రం అలుసు కాదూ? లోకానికి మాత్రం అలుసు కాదా?

కాపురానికి వెళ్లిన కొత్తలో ఎక్కువ పనులు తగులుతుండేవి కాదుగాని తరువాత తరువాత ఆమె ఏమీ పట్టించుకోనకపోవటం, పనులన్నీ నేనే చేసుకోవలసిరావటం జరుగుతూ వచ్చింది. వారు నాతో సరిగా వుండకపోవటంవల్లనైతేనేమి, ఒకవైపున అత్తగారితో పోట్లాటలవల్లనైతే నేమి జీవితమే చాలా చీకాకుగా ఉండేది. సాధారణంగా ఎప్పుడు ఏవో పనులతోనే ప్రొద్దుపోతూ వుండేది. ఎప్పుడైనా తీరిక చిక్కినప్పుడు వీటన్నిటిని గురించి ఆలోచించి ఆలోచించి మనస్సు మరీ పాడైపోతుండేది. ఆ ఆలోచనలేవీ జ్ఞాపకం రాకుండావుంటానికే ఉపయోగపడుతుందేమోనని తీరిక ఉన్నప్పుడు ఏదైనా పుస్తకం చదవటం మామూలుగా పెట్టుకున్నాను. అప్పుడు దీపావళి దగ్గరకొస్తూ వున్నది. ఆ రోజు పండగ పనులతో పగలంతా ఒళ్లు విరగ్గొట్టుకుని పని చేశాను. రాత్రిపూట భోజనాలైన తరువాత గదిలో చదువుకుంటూ పండుకున్నాను. ఎప్పుడైనా మా అత్తగారు చావడిలో పడుకుంటూ వుండేది. ఈ ఇంట్లో ఏమి జరుగుతున్నా ఆమెకు తెలియటానికి అవకాశం వుండేదికాదు. వారు గది తలుపులు నెట్టుకుని లోపలకు వచ్చి పండుకున్నారు. నేను చదువుకుంటూనే వున్నాను.

'మా అమ్మ అంటుందంటే అనదుమరి? ఇంత ప్రొద్దుపోయినా లాంతరువత్తి అంత పెద్దదిగా వుంచితే?' అని కసిరారు.

మీ అమ్మ మీరు అనందిదేనికి? నన్ను చూస్తే సరి ఏవో ఒకటి మీకు అనబుద్ధి అవుతూనే వుంటుంది—అన్నాను.

లాంతరు తగ్గించి ముందు నీవిట్రా. అన్నారు. ఎందుకన్నాను.

'ఎందుకో నోరుమూసుకుని ముందురా లేచి.' అన్నారు విసుగ్గా. నేను పుస్తకం చేత్తోపట్టుకునే వెళ్లాను. నా చేతిలో పుస్తకం లాక్కుని ముందు కాళ్లు పట్టమన్నారు. అలాగే చేస్తూవున్నాను. పుస్తకం తెరచిమూచి ముఖం చిట్లించుకుని ప్రతి పుస్తకంమీద సత్యం పేరు వ్రాస్తావెందుకు? అంటూ అదోక మోస్తరుగా చూచారు నావైపు. ఆ చూపు నా మీద అసహ్యభావాన్ని స్ఫురింపజేస్తూ వున్నది. ఎందుకో నామీద నాకే జాలివేసిందా క్షణాన. నేనేమైనా తప్పు చేసివుంటానేమోనని ఆత్మ విమర్శ చేసుకోవటానికి కూడా నా మనస్సు అంగీకరించలా. ఏమి? అన్నాను వెంటనే అమాయికంగా. 'ఏమా? ఎందుకు వ్రాస్తావని అడుగుతున్నాను. ప్రశ్నకు ప్రతిప్రశ్న కాదు నేను కోరుతున్నది జవాబు' అంటూ పళ్లునూరుతూ చూపులు బీభత్సం చేశారు.

నేను వ్రాయలేదే. అది ఆయనగారే వ్రాసుకున్నారు—అన్నాను.

నీ పుస్తకంమీద అతని పేరెందుకు వ్రాశాడు? అన్నారు ఇంకా ఏమో దీర్ఘంగా ఆలోచించుకుంటూ.

ఇది నా పుస్తకం కాదు. ఆయన పుస్తకమే.

అతని పుస్తకాలు నీ దగ్గర కెందుకు వస్తవి?

ఆయన భార్య నాకు బాగా తెలిసినామె. ఆమెను ఏవైనా పుస్తకాలు ఇవ్వమంటే ఇవి ఇచ్చింది.

ఇకనుంచీ ఆ పుస్తకాలేవైనాసరే ఇక్కడకు తీసుకువచ్చావంటే నేను వూరుకునేదిలేదు. ఇదే చెప్పటం. ఎప్పుడైనా మీ వూరు వెళ్లినప్పుడు వాళ్ల ఇంటికి వెళ్లినట్లు తెలిసినా ఎక్కడైనా అతనితో మాట్లాడినట్లు తెలిసినాసరే అంతటితో పోవలసిందే.

ఇదంతా ఏమిటో నాకు బోధపడటంలేదే. ఆయన చేసిన తప్పేమిటి? నేను చేసిన తప్పేమిటి?

అదేమిటో మీకే తెలియాలి. 'ఇంతకూ నీవు నేను చెప్పినట్లుగా నడుకుకో తలంచుకొన్నావా లేదా?'

'ఇలాంటి విషయాల్లో మీకు నేను వాగ్దాన

మివ్వవలసిన అవసరం నా కేమీ కనపడటంలేదు. పైగా ఇలాంటి వాటివల్ల లోకంలో లేనిపోని నిందలకు తావివ్వటమే అవుతుందని నా అభిప్రాయం.'

'చేసిన తప్పును దిద్దుకోవటానికి బదులు ఇంకా ఎదురు చెపుతున్నావా? సిగ్గులేక? అతనితో మాట్లాడకుండా ఉంటావా ఉండవా? ఏదో ఒకటే చెప్పు నాకు ఉంటాననో, ఉండననో—'అని వేలు చూపించారు.

'నేను తప్పేమీ చేయలేదు సరిగదా. దీని మూలాన తప్పుచేసినదాననవుతానేమోనని భయపడుతున్నాను. మీరు నన్ను ఏమిచేసినాసరే, ఈ విషయంలో మాత్రం నేనే బాగా ఆలోచించుకుని ఏదైనా నా యిష్టంవచ్చినట్లుగా నడుచుకోవలసిందే కాని ఇప్పుడు మీకు నేను చెప్పేదేమీ లేదు—అని అనీ అనటంతోనే ఏమీ ఆధారంలేకుండా నిలపెట్టిన పుస్తకంలాగా పోయి వెనక్కుపడ్డాను. కొంచెంసేపటికి ఎడమకాలితో ఒక్క తన్ను తన్నినట్లుగా జ్ఞాపకం వచ్చింది. అది నా జీవితంలో మొదటితన్ను. నా కింక భూమ్యాకాశాలు తెలియలేదు. నా బాధల్లో మిగిలున్నభాగం కాస్తా అయిపోయిందా రోజుతో. నా శరీరమంతా భగ్గునమండి బూడిద కాలేదు. సమయం వచ్చినప్పుడు ప్రతీకారం చేయటానికా? అన్నట్లు ఎఱ్ఱగా కాలిన ఇనపచువ్వలాగా అయిపోయింది. నా హృదయమంతా కాలిన ఇనపచువ్వ కుండవలసినంత వేడిగా మారిపోయింది. నా కన్నులలో ప్రళయరుద్రమూర్తి తాండవమాడుతున్నట్లుగా ఆశ్చర్యంగా నిశ్చేష్టితురాలనై వారివైపు చూస్తూ అలాగే నిలబడ్డాను. కళ్లవెంబడి బాష్పకణాలు నిప్పుకణాలలాగా రాలుతూ ఉన్నవి. నాకు అసలు పెండ్లికాకముందు అయిన తరువాత కూడా భర్తలు భార్యలను కొట్టటాన్ని గురించి తీవ్రంగా ఆలోచించేదాన్ని. చిన్న పిల్లలుగా వున్నప్పుడే ఎవరైనా కొడుతూవుంటే అంత అవమానంగానూ, అసహ్యంగాను వుంటుందే పెద్దవాళ్ళయిన తరువాతకూడా అంతంత పెద్దవాళ్లు అంతంత పెద్దవాళ్లను పట్టుకుని కొడుతూవుండటం తలుచుకుంటే అదొక రాక్షసకృత్యంలాగా అనిపించేది. ఎంతో సహించరానిదిగా ఉండేది. ఒక్కసారి కొట్టినతరువాత ఇంకా ఆ భర్తముఖం ఎలా చూస్తారా, అనిపించేది. ఇంకా అతనితో కలిసి వుండేదానికన్నా ఎందుకు చావరా అనుకునేదాన్ని. అవన్నీ తలుచుకుంటే అసలు పెండ్లే వద్దనిపించేది; పెండ్లి కాకముం దొకసారి. అయినా వాళ్లు కొట్టటానికి కూడా వీళ్ళ లోపాలుకూడా వుండవచ్చును గదా. అలాంటి పొరపాట్లేమీ రాకుండా చూసుకుంటే ఎందుకు కొడతారు? తప్పు చెయ్యకుండానే వుందాం; అనుకున్నప్పుడు పెండ్లి కావాలనే అనిపించేది. నావరకు నేను పెండ్లికాకముందు అయిన తరువాత కూడా ఆలోచించి ఆలోచించీ, తప్పు చేయకపోతే కొట్టరుకదా. ఒకవేళ చెయ్యకుండా వున్నా కొడతారా, ఆ కొట్టిన మొదటిసారితోనే ఆఖరుకు ఎక్కడా వుంటానికికూడా వీలు లేకపోతే చచ్చైనా పోదామనే నిర్ణయానికి వచ్చాను. అంతకుముందు కొట్టకపోయినా కొడ్తాను కొడ్తాను అని చెప్పనైనా చెప్పేవారు. అప్పుడు చెప్పనైనా చెప్పకుండానే అంత పనీ చేశారు. అంతకుముందు కొడతా నన్నప్పుడల్లా 'కొడతారు, ఎందుకు కొట్టరు? కొట్టినా ఎన్నిసార్లు కొటొచ్చారేం?అనేదాన్ని.' ఎన్నిసార్లైనా కొడతాననేవారు. అలా ఎప్పుడు జరగదని ఖచ్చితంగానే చెప్పేదాన్ని.

వారి మాట కొంతవరకు చెల్లించుకున్నారు. ఇక నా మాటే మిగిలున్నది. ఏం చెయ్యటమా? అని ఆలోచించాను. ఏమి చేయవలసినదీ ఇదివరకే అనేకసార్లు ఒక నిర్ణయానికి వచ్చికూడా సమయం వచ్చేసరికి మళ్లీ ప్రశ్న వేసుకోవటంలో కర్తవ్యానికి దూరమౌతున్న నా బలహీనత కళ్ళకు కట్టినట్లు కనపడింది. నాకు తెలియకుండానే నా చిన్నప్పటి ఆలోచనలకు ఏదో ఒక గుదిబండలాంటి బాధ్యత అడ్డు తగిలింది. వారాపని చేయటానికి ఒక నిమిషంకూడా నాకు నేను చిన్నదాననుగానే వున్నాను. మరు నిమిషానికే ఒక ముసలమ్మనైపోయానేమో ననిపించింది. అలాగే చూస్తూ నిలబడినానే కాని ఏమీ తోచలేదు. నా చూపులు వారి కళ్లల్లో గుచ్చినవో ఏమో 'ఏమిటా చూపు ఇంకా అనుమానం తీరలేదా? మళ్లీ తగలాలా, అన్నారు చెయ్యెత్తుతూ.

'అనుమానం నా కెప్పుడూ లేదు. మీకే అనుమానంగా వున్నది. మీరు కానిచ్చే దేమిటో ముందు

కానివ్వండి. అందర నుమానాలు తరువాత తీరుతై.' అన్నాను.

'ఇంకా పొగరుబోతుతనం పోనేలేదా?' అంటూ మళ్లీ చెంపమీద ఈడ్చి కొట్టారు. ఒక మెరుపు మెరిసి నా కళ్లు బయర్లు కమ్మినవి. అంతటితో నాతో పాటు నా ఆలోచనలు కూడా స్తంభించి పోయినవి. నాకు తెలియకుండా నేనా మంచం మీదకుపోయి ఒత్తిగిలాను.

'జాగ్రత్త! ఒళ్లు దగ్గర పెట్టుకొని బ్రతుకు' అంటూ ముసుకు పెట్టుకున్నారు వారు. మళ్లీ నాకు కొంచెం స్పృహ వస్తుండేటప్పటికీ 'జాగ్రత్త ఒళ్లు దగ్గర పెట్టుకు బ్రతుకు' అన్నమాట నా చెవుల్లో గింగురుమంటూంది. ఈ మాట వారు పెడుతున్న గురకకు తాళం వేస్తున్నట్లుగా ఉన్నది. ప్రకృతి మాత్రం ఊఁ ఊఁ. ఊఁ. అంటూ విరామంలేకుండా మూలుగుతూనే ఉన్నది. ఆ మూలుగులోనే నా జీవితాన్ని గూడా ఐక్యంచేయా లనిపించింది. వెంటనే ఆ భావన పిరికితనంగా తోచింది. నేను సాధించా లనుకున్న విషయం సాధించలేననుకున్నా. తొందరపడి పుట్టినింటికి వెళ్ళినా వాళ్లు తేలికగానే చూస్తారుకదా? ఈ ఒక్కసారికీ సహించుదా మనుకున్నా. ఇంకా ఏమో ఆలోచిస్తూనే వున్నాను.

ఇంతలోకే కాకులు కాకా మంటూ గోల పెట్టటం ప్రారంభించినవి. రయ్యి రయ్యిన ఇంట్లోకి తెల్లనికాంతులు ప్రవేశించుతున్నవి. అబ్బ! తెల్లవార్లు నిద్రలేకపోయినా లేవక తప్పదుకదా ? అనుకుంటున్నాను.

'పొద్దు పొడిసినా ఇంకా లేవరేవమ్మా, ఎవరన్నా మాస్తే నవ్వి పోదురే' అని అంటూ వున్నదప్పుడే మా అత్తగారు; ఏదో చప్పుడు చేస్తూ. సరే ఎలాగు తప్పేది లేదుగదా అని వెంటనే లేచి బయటకు వెళ్లాను. ఆ రోజు కూడా మామూలు పనిపాటలన్నీ అలవాటుగా చేసుకు పోతున్నానే కాని కొంచెం మెదడుతో అవసరమయ్యే పనులు పాడై పోతూనే వున్నవి. పొయ్యిమీద పప్పుగిన్నె పెట్టి పొయ్యి కెదురుగా కూర్చుని కాయగూరలు తరుగుతూ వున్నాను.

'అయ్యయ్యో, ఇంకా ఆ దూడ బతకనేనా ? అది చస్తే మాత్రం మీకేం లే ? నాకేగా తిప్పలు' అంటూ ఆమె నీళ్లు తాగుతున్న పసిదూడను చెవ్వు వట్టుకుని అవతలకు లాగుతూ వున్నది నేను తలెత్తి చూచేటప్పటికి.

'నేను చూడలేదండీ' అన్నాను. అయితే మాత్రం ఆమె అంతమాత్రానికి వూరుకుంటుందా ?

'ఎదురుగానే వుంటే ఎట్టా చూళ్ళేదమ్మా, అంతా ఉబద్రం, ఎవరన్నా ఇంటే నవ్విపోదురే, ఆయనేమో అట్టా జూస్తున్నాడు. నువ్వే మన్నా ఇట్టా జెయ్యి సరిపోతది. రెండు రెండే సమకూరినైలే. దేవుడే అట్టా సమకూరుస్తాడు కావాల, నేనెంత ఏకెలు బోకెలు యిరుసుకుంటే మాత్రం ఏం లాబం ? ఎవళ్లుజేసేది వాళ్లు జాస్తానే వుంటిరి?' అని ఆమె అంటూ వుండగానే ఈ విషయంఅప్పుడే పొరుగింటామె చెవిన ఎప్పుడు పడిందో ఏమో నిప్పుకోసం వచ్చినట్లుగా గంటె ఒకటిచేత్తో పట్టుకుని 'ఏందీ ?' అంటూ వచ్చింది ఉత్సాహంగా, ఇక మళ్ళీ మొదలు మెట్టిందామె పాట.

'మా పనెట్టా వుందనుకున్నావేం ? వాడే మాన్నా వున్నదికాస్తా అట్టా నాశనం జాస్తా కదిలిస్తే మేదకి దోకొస్తాడు. ఈ బెణ్ణేమన్నా పలకరించే యాలే లేదు.' అని ఆమె ఏమేమో సాధిస్తూ వుంటే అవి వింటూ పొయ్యిమీద పప్పుగిన్నె మాట మరిచేపోయాను.

'పొయ్యిమీద ఏం తగలేశావేం ? కాటు కంపు కొడతావుంది' అన్నదామె అప్పుడే ఆ వాసన ఎలా పట్టిందో ఏమో.

'పప్పులో ఎసరు తగ్గిపోయినట్లున్నది' అంటూ పప్పుగిన్నె మీద మూత తీసేటప్పటికి మాడిపోయిన వాసన ఇంకా గప్పుమని వచ్చింది.

'ఇంకేం జేసుకో నా పప్పు! చూడవమ్మా చూడు. ప్రతి పని యింతే. నేను కాసేపు ఎక్కడ లేకపోతే అక్కడల్లా నాశనంగా వాల్చిందే ననుకో. రామరామ ఒక్క పనిగూడ చేత గాదు గదా ? ఆ అమ్మ ఎట్టా పెంచిందో ఏమో మరి. కని మందికొంపలమీదికి పెడ్తే సరనుకుంటారమ్మ ఒకొకళ్లు. ఇంత సొరంతిలేకుండా పనులుచేసే కోడళ్లని ఏ యింట్లోనన్నా చూశావటమ్మా! నువ్వు?'

అని ఒక చెయ్యి నడుమున పెట్టుకుని ఒక చెయ్యి మూతిమీద పెట్టుకున్నది ఆశ్చర్యంగా.

'ఇప్పుడు నేనేం చేశానని నన్నింతగా సాధించటం? ఎవరికైనా పొరపాటు రాకుండా ఉంటుందా? చేసేవాళ్లెంత పాడుచేస్తున్నా బాగానే వుంటుంది. నావల్లమాత్రం ఏ కొంచెం పొరపాటువచ్చినా గొంతు పట్టుకుంటారు. అసలైనా గాని ఎక్కడో వున్నవాళ్ళ జోలి ఏమి వస్తుంది మీకు మాట మాట్లాడితే?' అన్నాను కూరగాయలు తరుగుతూనే. 'ఇట్టా ఎదురుకూతలు కూసే వాళ్లింకేం కాపరం జాస్తరమ్మ. ఇన్నిటికీ వాడు మంచాడు గాదులే. వాడే సరైనావాడైతే అంతా చచ్చినట్టే పడుండేవాళ్లు' అన్నదామె. కొడుకు ఇంకా నన్ను రాచి రంపాన పెడితే బాగుండు నన్నట్లుగా. 'పెద్దాళ్ళు ఏడయినా విసుక్కున్నా నువ్వు వూరుకుంటే పోద్దిలే అమ్మాయి' అన్నది పొరుగింటామె నాదే తప్పన్నట్లుగా.

'ఒకరి కష్టాలు ఒకరికేం తెలుస్తవిలేండి. ఎదటి వాళ్ళకు ఎన్నైనా చెప్పవచ్చు. తమదాకా వస్తే గదా తెలిసేది' అన్నాను.

'అంత ఆడ నలుసటువంటిదన్నా కనబడితే ఆ అబ్బాయైనా కాస్త తిన్నంగా వుండేవాడేమో. అదీ లేదాయె. అంతేలేవదెనా. ఒకొకళ్ళ కెన్నాళ్లున్నా తీరవు కష్టాలు' అన్నది పొరిగింటామె మా అత్త గారితో.

'అయ్యో అంతమాత్రపురాత. ఇటువంటి మొకాలకే అటువంటి గీతలబ్బేది. ఆ గీతుంటే మాకీ సంబంధమే అయ్యేది కాదనుకో ఎందుకక్కడ' అన్నది మాఅత్తగారు నొసలుమీద చేతితో కొట్టుకుని.

'ఎండెక్కింది పొయ్యి రాజెయ్యాల' అంటూ పొరుగింటామె వెళ్లిపోయింది.

మా అత్తగారి కోర్కకు తగ్గట్లుగానే క్రిందటి రాత్రి జరిగిన సంఘటనవల్ల మేము ఎడముఖం పెడ ముఖంగా వుండటం ఆమెకు మరీ సంతోషమైంది. ఆ రోజునుంచీ కూడా మాటమాట్లాడితే నా మీదకు ఒంటి కాలిమీద తగాదాకు రావటం సాగించింది. ఆ సంఘటన జరగకముందు అంతి ఇష్టంలేకపోయినప్పటికి మనిషన్న తరువాత ఎవరో ఒకరితో ప్రొద్దు పుచ్చుకోవాలి కాబట్టి నాకు తోచనప్పుడల్లా నేనే వారి దగ్గరకువెళ్లి కూర్చోవటం ఏవో పిచ్చాపాటి నాలుగు ఖబుర్లు చెప్పుకోవటం జరుగుతుండేది. ఆ సంఘటన జరిగిప్పటినుండి మాత్రం వారిని చూడ బోతేనే చాలా సిగ్గుగా వుండేది. అవమానంగాను, అసహ్యంగాను కూడా వుండేది. ఎక్కువ తెలివి తేటలు, చదువు, చక్కదనము, లేకపోయినప్పటికీ అంతకుముందు అదోకరకమైనజాలివుండేది వారిమీద. తరువాత అది కాస్తాపోయింది. ఇంకా నేనే వుద్దేశంతో వారి దగ్గరకుపోయి మామూలుగా ఖబుర్లు చెప్పగలను? నామీద అపనమ్మకం ఏర్పడిన తరువాత నేను ఖబుర్లు చెప్తేమాత్రం వారు సంతోషిస్తారని ఎలా అనుకుంటాను? ఈ విధంగా నే మాట్లాడకుండావుంటే ఇలాగే అలవాటైపోయి ఇంకా ఎక్కువ ప్రమాదానికి గురికావలసివస్తుందని భయపడి ఎప్పుడైనా చూచాయగా మాటలు అందించబోయేదాన్ని. కాని వారుమాత్రం ఆ అవకాశం ఇచ్చే వారు కాదు. తమకు ఏవి కావలసివచ్చినా తమ తల్లినే అడిగి కావలసినపనులు చేయించుకుంటుండే వారు. ఆమెకూడా నన్నడగకుండా తననే అడుగుతున్నందువల్ల ఎప్పటికంటే ఇంకా ఎదురెదురుగా వుండి కొడుకు నోట్లోమాటనోట్లో ఉండగానే ఎప్పటికప్పుడు అమర్చిపెడుతూ వుండేది. ఆమె కొడుకుతో కబుర్లు చెప్పుకుంటూ కొడుక్కు కావలసినవన్నీ అందిస్తూ అక్కడే ప్రొద్దుపుచ్చుకుంటుండేది. ఆమె చేయవలసిన పనులుకూడా నేనే చేయవలసి రావటంవల్ల ఎప్పుడైనా వారికి అలా కనుపించుదామన్నా వీలులేకపోయేది. ఈవిధంగా వాళ్ల తల్లీ కుమారుల మధ్య వాత్సల్యం అభివృద్ధికావటం మా దాంపత్య ప్రేమ సన్నగిల్లిపోవటం జరుగుతూ వచ్చింది.

ఒకొకసారి ఎవరైనావచ్చిఒక్కగానొక్క కొడుకుంటే అంత ఆడనలుసంటిదన్నా కనపడకపోయెనే పాపం! అనేవాళ్లు. వాళ్లామాట అనటంతోనే ఆమెలోఉన్న అసంతృప్తి జ్వాలలన్నీ ఒక్కసారిగా ప్రజ్వరిల్లేవి. ఆ రాతుంటే మాకీ సంబంధమయ్యేదే కాదు. అనేది ఆమె ఉక్రోషంగా. ఆమె మాట అన్నప్పుడల్లా నేనేమీ తప్పు చెయ్యకుండానే నా మీదకు తప్పులన్నీ ఇలా ఎందుకు వచ్చిపడుతున్నవో

అని చాలా విచారపడేదాన్ని. ఆమెమాత్రం మాకు సంతానంలేదని ఎంత బాధపడేదో చెప్పటానికి వీలు లేదు. నిజంగా ఆమెకు బాధ అనేది ఏదైనావుంటే ఇదేనని చెప్పాలి. ఏ విధంగానైనా సరే తన కొడుక్కు కొడుకు పుట్టాలి, తాను ఎత్తుకోవాలి. ఆమె జీవితంలో అదేకనక లేకపోతే చేసిన శ్రమలైతేనేమి, అనుభవించిన బాధలైతేనేమి అన్నీ వ్యర్థమేనని ఆమె నమ్మకం. అందుకోసం ఆమె ఏది చేయటానికైనా జంకదు గొంకదు. ఈ మా ఎడబాటును ఆధారం చేసుకుని ఆమె కొడుక్కు నూరిపోయవలసినవన్నీ నూరిపోసింది. ఇక నది నీకు కాపరం చేయదనే కాదు, ఇక దానిని పిల్లలు పుట్టరనేకాదు, భార్య మీద భర్తకు విరక్తి కలగటానికి ఏవేవైతే అవసరమో అవన్నీ రంగరించిపోసింది. కొడుకు ఆ తల్లి మాయ మాటల్లోపడి నాతోవున్న సంబంధం ఇంకా ఎడమై పోసాగింది. నేనా ప్రమాదాన్ని గుర్తించకపోలేదు. నేనీ ఇల్లు దాటిపోతే సమాజంలో నాకుండే స్థానాన్ని తెలుసుకోకపోలేదు. అయినా చేయగలిగినంతవరకేకదా నేను చేసేది. ఏ మానవుడైనా ఏలాంటి పరిస్థితుల్లోనైనా తనకున్న సర్వశక్తులను వినియోగించుకోనగలడేకాని అంతకన్నా ఏం చేయగలడు? ఆ రాత్రిమాత్రం ఏదో ఒక అభాండమైన నేరాన్ని నా నెత్తిమీద మోపవస్తే అప్పటి కింకా నిజంతో కూడుకున్న నా నిర్మల హృదయాన్ని బూటకపు లౌకికచ్ఛాయలు ఆవరించకపోవటాన ఉన్నదున్నట్లుగా నా హృదయంలోని విషయాన్ని విప్పి చూపించి సత్యంతో నాకేలాంటి సంబంధము లేదనీ, మాట్లాడకుండా వుండవలసిన అవసరం నాకేమీ కనిపించటం లేదని, అంత గట్టిగా చెప్పానే కాని ఇంతదాకా వస్తుందనుకున్నానా? పోనీ అప్పుడేదో ఆ క్షణాన అలా అన్నానే అనుకోండి. తరువాత ఎంత ప్రయత్నం చేశాను. వారి మనస్సును మామూలు పరిస్థితుల్లోకి తీసుకురావటంకోసం? తను పలుకరించకపోయినప్పటికీ ఏదో ఒకవంక పెట్టుకుని నేనే పలకరించినప్పటికీ పలికేవారు కాదు. ఒకొకసారి నేను మంచినీళ్లు తాగుతూవుంటే వారికే జాలయ్యేదో ఏమో నాకుకూడా ఇవ్వు అనేవారు. ఏముంది సిగ్గ లేకపోతే సరి. అంత పెళ్లాంతో మాట్లాడకుండా వుండలేని వాళ్లు మూడురోజులకొకసారి గూపులు చేసుకోవటం ఎందుకు మరీ—అని ఆమెలో ఆమె గొణుక్కుంటూ వుండేది. అలా అనగానే వారు అడిగితేమాత్రం నేనెందు కిచ్చానా అనిపించేది. వారికెలా వుండేదో ఏమో మళ్ళీ కొన్ని రోజులవరకు ఆ మంచినీళ్లు కూడా అడిగేవారే కాదు. ఆ రోజుల్లో రాత్రిళ్లు గడపటం మరీ కష్టంగా వుండేది. ప్రొద్దు క్రుంకుతూవుంటే సరి భయంగా వుండేది. ఎప్పటిలాగే ఇద్దరం ఒక గదిలోనే పండుకుంటుండేవాళ్లం. ఎరగనివాళ్ళకు మేము బాగానే వున్నట్లు కనపడేది. మేము మాత్రం మాట్లాడుకోనైనా మాట్లాడుకునే వాళ్ళం కాదు. సాధారణంగా ఎప్పుడూ వూళ్లోనే వుండేవారు కాదు. ఉన్నప్పుడైనా అలాగే జరిగేది. నేనే ఒకొకసారి బ్రతిమలాడేదాన్ని. ఒకొక రాత్రి మరీ పట్టుపట్టి అడిగేదాన్ని నామీద మీకంత కోపం ఎందుకని. వారినుండి ఏమీ జవాబే వచ్చేది కాదు. అయినప్పటికీ ఏదో ఒకటి చెపుతూనే వుండేదాన్ని.

'నేను సత్యంతో మాట్లాడకుండా వుంటానని మీకు వాగ్దానం చెయ్యలేదనా? సరే ఆలాగే చేస్తానులెండి. మనం ఇలా చెయ్యటంవల్ల మనం ఇతరులను లేని అనుమానాలకు తావిచ్చినవాళ్ళ మూతామని ఆరోజు మీకు వాగ్దానం చేయలేకపోయాను గాని ఏమీ లేదు. ఆయనతో మాట్లాడకుండా వుండటమే కాదు మా వూరే వెళ్ళటం మానెయ్యమన్నా మానేస్తాను. మనస్ఫూర్తిగా చెపుతున్నాను. నేనింకెప్పటికీ సత్యంతో మాట్లాడను.'

అని అంటూంటే ఎందుకో నా గొంతు వణకసాగింది. నేను గుడ్డిగా ఏపని పడితే ఆపని చేయటానికి తయారవుతున్నానేమో ననిపించి శరీరమంతా చెమటలు పట్టిపోయింది. నేనలా వాగ్దానం చేయటానికి లోపల బాధపడుతున్నాననుకున్నట్లున్నారు.

ఇకముందు నీవు నా ఎదుట ఎలాంటి వాగ్దానాలు చేయవద్దు. నాకు నిజంగా నీతో జీవితం గడపాలని లేనేలేదు. నీవు ఉన్నా ఒకటే పోయినా ఒకటే నాకు. ఇంకా పోతేనే శ్రేయస్సును చేకూర్చినదానవౌతావు. — అన్నారు. నేను తప్పు చేశానో లేదో తెలుసుకునే సమర్థతైనా వుండాలి మనిషిలో. లేకపోతే ఒకవేళ చేసే వుంటాననే అనుమానమే వుంటే నా తప్పును దిద్దటానికైనా ప్రయత్నం చేయాలి. అదీ ఇదీ కాకుండా

ఏదో ఒక నేరాన్ని పైన వేసి బయటకు నెట్టాలని చూచేవాళ్లతో ఇంకా నేనెందాకా కలసివుండ గలను. ఇవతలకు వచ్చినా తిప్పలే ననే ఉద్దేశంతో అక్కడే వుందామని ప్రయత్నం చేయటమే కాని నా కసలు ఆమనుష్యులన్నా, ఆ ఇల్లన్నా విరక్తికలిగింది. ఏమైనా సరేనని అలాగే జీవితాన్ని గడుపుతూ వున్నాను.

ఒక రోజు ఉదయం భోజనాలైన తరువాత మా అత్తగారు ఎక్కడికో బయటకు వెళ్లింది. వారు నా మెళ్ళో గొలుసు ఇవ్వమన్నారు. ఎందుకన్నాను.

ఎందుకేమిటి తీసి ఇవ్వక—అన్నారు.

అంత చెప్పకూడదా ఏమిటి?—అన్నాను.

అప్పులున్నవి కావాలి.

అయితే మీ అమ్మను రానివ్వండి ఆమెకూడా ఇవ్వమంటే ఇస్తాను. లేకపోతే మొగుడి మెప్పుకోసం ఇచ్చిందంటుంది. నా కెందుకు వచ్చిన గొడవ ఇదంతా?

మా అమ్మ ఏదన్నా అంటే నేనే తీసుకు వెళ్లానని చెప్పు. దీనిలో మా అమ్మ పెత్తనం ఏమున్నది? నీవే మర్యాదగా ఇస్తావా లేక నన్ను చెయ్యి చేసుకోమంటావా—అని గదిమారు.

మీకు అప్పులుంటేనా గొలుసు కాకపోతే ఇంకేదైనా అమ్ముకోకూడదా? మీరు ఇంటిఖర్చుల కోసం ఏమి వాడారని మీకు ఇన్ని అప్పులైనవి? అనవసరంగా ఇంత బంగారం తీసుకు వెళ్లి నాశనం చేస్తానంటారేం? నాకు మాత్రం చేతులమీదగా ఇవ్వటానికి ప్రాణం ఒప్పటంలేదు...—అన్నాను.

బాగా ఎదురు మాట్లాడటం నేర్చుకున్నావే—అంటూ తలమీద ఒకదెబ్బ కొట్టి గొలుసు లాక్కున్నారు. నాకళ్ళంబడి నీళ్లు బొటబొట కారినవి.

ఇంకా ఏడుస్తున్నావా సిగ్గులేక. ఇదివరకు అనేదానవుగా—ఎన్నిసార్లు కొడ్తారో కొట్టమని, ఇప్పుడేం జేస్తున్నా ఏడుస్తూ కూర్చోలా? అంటూ చెప్పులు తొడుక్కు వెళ్లిపోయారు.

అప్పుడు పూర్తిగా తెలిసిపోయింది భార్య తప్పు చెయకపోయినా భర్తకు ఈ సంఘంలో కొట్టే అవకాశం ఉన్నదని. అంతకుముందు నాకు నేను ప్రత్యేకంగా చూచుకున్నాను కాని తరువాత మాత్రం అదొక అలవాటుగా అప్పుడప్పుడు భర్తల చేత దెబ్బలు తినే స్త్రీలల్లో నేను ఒకదాననైపోయానుగదా; అనుకున్నాను. నా జీవితం ఈవిధంగా అవుతుందని ఎన్నడు అనుకోలేదు. అన్ని విధాల అనుకూల దాంపత్యంలో ఉన్నా సంతోషసౌఖ్యాలు లేకపోవచ్చుగాని, అన్ని విధాల నాకంటే వెనక పడిఉన్న భర్తచేత అవమానింపబడటం మాత్రం అసంభవమనిపించేది. నేననుకున్నదంతా వ్యతిరేకమైనదీనాడు. ఇలా జరిగిన పక్షంలో చేయాలనుకున్న పని అంతకంటే చేయలేకపోతున్నానే. భర్త నిలవనివ్వకపోతే పుట్టింటికి వెళ్లితే అక్కడ గౌరవ మర్యాదల సంగతి తెలిసే వున్నా మరీ నీచమైన బాధల నుంచి తప్పించుకోటానికైనా పుట్టినింటికి వెళ్ళవచ్చు. కాని సంఘం? సంఘంలో ప్రతి మనిషి తను పడుతున్న బాధలే అందరు పడాలని కోరుతూ వుండటం సహజం. తమకు ఆత్మాభిమానాన్ని కాపాడుకోటానికి సాహసం లేకపోగా ఎవరైనా అలాంటి పనికి పూనుకున్నా వాళ్ళను తిప్పి తమ స్థానంలోకి తీసుకు వచ్చేదాకా నిద్రపోరు. అబ్బ. ఏమి సంఘం? నిజంగా ఈ సంఘాన్ని తలచుకుంటే చిత్రవధచేసే ఫాసిస్టును చూచినంత భయంగా ఉంటుంది.

భర్త ఇష్టమైనవాడైనా సరే కాకపోయినా సరే జీవితాన్ని సమర్పించవలసిందేనని శాసిస్తూందీ సంఘం. ఇంతకంటే ఘోరం ఏమున్నది? భర్తంటే ఏమాత్రం ఇష్టంలేనట్లు తెలిసినా స్త్రీని సంఘం నీచురాలుగా చూస్తుంది. భర్త భార్యకు గానీ, భార్య భర్తకు గాని దేనికోసమో అదంతా సంఘాని కవసరం. ప్రతి స్త్రీకి ఒక భర్త కావాలి. భర్త చెప్పినదల్లా భార్య చేసి తీరాలి. అలా చేస్తున్నప్పటికీ భర్తకు ఏ ఇతర కారణాలవల్లనైనా సరే కోపంవచ్చి తిట్టినా కొట్టినా కూడా కిక్కురుమనకుండా భర్త పాదాలక్రింద ప్రాణాలు వదలవలసిందే. ఇది సంఘాదర్శం. ఈలాంటి సంఘాదర్శాలలో దారి తెన్ను కానలేక జీవితాన్ని విరమించుకుందామన్నా దానికీ సంఘమే నిందిస్తుంది. 'కాడు కాలుతూవుంటే కన్య ఎదురు చూస్తూ వుంటుందనీ, అదిపోతే దానంటివాళ్లు లక్షతొంభైమంది వస్తారు, చచ్చి ఎవర్ని సాధించాలనుకుందో అనీ, లోకం ఇష్టంవచ్చినట్లుగా ఆడిపోసుకుంటుంది. ఏమి చేయటమా అని ఆలోచిస్తూ ఉన్నాను.

పొద్దుగూకినా ఇంకా పనిలోఏలన్నా పెట్టక పోతే ఎప్పుడవుద్దమ్మా. మరీ బూటకంగా ఉందే —అని అంటున్నది తూర్పింట్లో మా అత్తగారు. 'గొలుసు అడుగుతుంది కాబోలు ఏమి చెప్పినా భగవంతుడా అనుకుంటూ బయటకు వచ్చాను.

వాళ్ళమ్మాయి పేరంటానికి పోతందట కాసేపు నీ గొలుసు ఎరువివ్వవే—అన్నదామె. నేనేమీ మాట్లాడకుండా గోడకానుకుని అలాగే నిలబడ్డాను.

పాపం నుంచోనుంటే మాట్లాడవేమే. ఇంత

లోకే అరిగిపోద్దా ఏం? అన్నది మళ్ళీ. లేదన్నాను గొంతు పెకలించుకుని.

లేదు ఏమైందీ—అన్నది ఆదుర్దాగా.

అప్పులున్నవట కావాలని నేనివ్వనన్నా కూడా బలవంతాన తీసుకెళ్లారు.

ఎవరు వాడేనా తీసుకెళ్లింది. అయ్యొయ్యొ, ఇంకా నేనేం జేద్దునే, నీ కట్టా చేతులొచ్చినియ్యే వాడి కియ్యటానికి? నేనింకా చావలేదుగా? బతికే వుంటినిగా, నాతో మాత్రం అనగూడదటే, కొంప నిలువునా ముంచితివిగదే. అన్నదామె గుండెలు బాదుకుంటూ, కాసేపుండి తెప్పరించుకుని—ఎంత సేపైందే—అన్నది మళ్ళీ.

చాలసేపైందన్నాను. 'చాలా సేపైందీ? చాలా సేపైందంటే చాలా సేపైంది. ఎంత ఒయ్యారంగా చెపుతున్నదో చూడు చాలసేపైందని. అవున్లే ఒయ్యారంగాక మీకేమమ్మ. నీదేం పోయిందిలే' నీ అబ్బగాడి సొమ్మైతేగా. నాకేం నాది కాదుగదా పోతే పోయిందనుకున్నావు. ఇంతే సాలు అడగనే అడిగాడు నా మొగుడేగదా అని ఎగిరి గంతేసిచ్చావు. ఇట్టాగన్నా వాడి మంచి సంపాదించుకుందామని చూశావు. అదే కనక మీ అయ్య చేయించినదైనట్లైతే ఊరంతా ఒక్క కొలిక్కి తీసుకురాక పోయావు. ఇక తిండురుగాన్లే ఉండండి' అంటూ 'ఇక నువ్వు పోమ్మ. మా యింట్లో గొలుసులుండే రోజులు రాలేదు లేవంద ఎందుకు? ఒకొక మహాతల్లి పాదం పెట్టిన నక్షత్రం అటువంటిది. ఈ మహాతల్లి మా యింట్లో ఎప్పుడైతే అడుగుపెట్టిందో అప్పట్నుంచీ అన్నీ వరసన ఊడ్చుకుపోవటమే. అప్పుడే అయిందీ మా పని. ఇంకెంత ఊడ్చుకుపోవాలో. ఒకొక గొడ్డొచ్చిన యాళ బిడ్డొచ్చిన యాళ అంటారిదే కావాల. నా కూతుళ్లు ఎక్కడ పాదం పెడితే అక్కడల్లా బంగారం అయివూరుకుంటుందంతే. ఇంత దరిద్రప మొకందీ, గొడ్డుబోతుదీ మా కెక్కడ దాపరించిందో మరి' అంటూ యీ వరసన ఒకటే పాట పాడటం మొదలు పెట్టిందామె. ఎంతసేపు చూచినా వూరుకుంటుందేమో అంటే వూరుకోదు. నాకు విసుకు వచ్చి, చీట్లాటలు, తాగుళ్లు, తిరుగుళ్లు అన్నీ కప్పిపెట్టి, నా గొంతు కోసిందికాక పైగా నాకు బడెందుకు ఎప్పుడు అట్లా ఏడుస్తారు? అంటూ లోపలకు పోయి పండుకున్నాను.

ఆ రోజునుంచీ మరీ కక్ష పట్టిందామె నా మీద. ఇక ఆ ఇంట్లో నాకొకనిమిషం ఒకయుగంగా గడుస్తూ ఉన్నది. ఎన్నాళ్లు చూచినా వారు ఇంటికే రాలేదు. వారసలు నామీద అలా అనుమాన పడటానికి కారణం ఆ తిరుగుడే ననుకోండి. అక్కడ ఒకావిడ ఉన్నది. తాను వారిని పూర్తిగా తన స్వాధీనంలో వుంచుకోటానికని కల్లిబొల్లి ఖబుర్లన్నీ కల్పించివిడాన్నెక్కస్తూ వున్నది నామీద విరక్తి కలిగించటానికని. ఇంటికి వస్తే తల్లి కూడా అలాగే నాయె. అసలు మనిషిలో స్వయంగా ఆలోచించుకో గలిగిన శక్తి లేకపోవటం వల్లనే ఇలాంటి ప్రమాదాలకు గురి కావలసివస్తూ వున్నది. అక్కడకు వెళ్లి వచ్చారంటే సరి ఏదో ఒక తగాదా తీసుకురావలసిందే. అక్కడకు వెళ్లి వచ్చినప్పుడల్లా ఏదో ఒక తగాదా జరుగుతూ వుందని ఎక్కడికి వెళ్లి వస్తున్నా సరే, ఆచెప్పుల మోత వినపడితే చాలా భయంగా ఉండేది. ఒకొకసారి ఆ చెప్పుల అడుగులు నా హృదయంలోనే పడుతున్నంత బాధగా ఉండేది. వీరు వస్తారంటే భయంగానే వున్నప్పటికీ ఇంట్లో పోరు మరీ ఎక్కువై పోవటాన వారు వస్తేనైనా కొంత పోరు తగ్గిపోతుందేమోనని ఎదురు చూస్తూ వుంటే ఎంత కాలానికీ రానే లేదు.

ఏమీ తోచక మళ్ళీ పుస్తకం చదువుకుంటున్నాను. ప్రక్కనే ఇంకొక పుస్తకం వున్నది. కాసేపటికి పొరుగింటి అమ్మాయి వచ్చి నా ప్రక్కనే కూర్చున్నది. నేను చదువుకుంటున్న పుస్తకం మూసేసి ఏమిటమ్మాయి అన్నాను. ఏమీ లేదు వూరికే వచ్చాను. మరే, ఇప్పుడే మేము కాఫీ రాస్తున్నాంగా? అన్నది. 'ఊఁ సరేలే' అన్నాను. మళ్ళీ నేను చదువుకుంటున్నాను. ఆ అమ్మాయి కొంచెం సేపుండి లేచిపోయినట్లుంది. నేను మరల రెండవ పుస్తకం తీసి చదువుకుంటున్నాను. అంతలో చెప్పులు కూడా చప్పుడు చెయ్యకుండానే ఒక్కసారి లోపలకు వచ్చారు వారు. నేను ఉలిక్కిపడి లేచి నిలబడ్డాను. నా చేతిలో పుస్తకం తీసుకున్నారు. 'నీ కెన్నిసార్లు చెప్పాల? బుద్ధిలేదు? చదివిన పుస్తకమే ఎన్నిసార్లు చదువుతావు? కనీసం వాడి పుస్తకమైనా చూడకుండా ఉండలేవన్న మాట. నాతో నీవు ఎన్ని మాయమాటలు చెప్పావు? ఇక నతనితో మాట్లాడననీ, మా వూరికి కూడా పోననీ చెప్పలా? నన్నవతలకు పోనిచ్చి మళ్ళీ ఇదేంపనీ? అసలు నీ మనసులో లేకుండా వుండాల గాని నిర్బంధంవల్ల నీ అలవాట్లను

ఎందాకా మార్చుకో గలవులే—అన్నారు ఒక్కసుక్కన.

చదువుకోడాని కింకేమీ పుస్తకాలు లేకపోవటాన, మాట్లాడటానికి కూడా ఎవ్వరు లేకపోటాన చదివిన పుస్తకమే చదువుకున్నాను కాని అంతకంటే ఏమీ లేదు. అంత మంచి ఆయనమీద కూడా ఎందుకు వేస్తారు నిందలు—అన్నాను సహించలేక.

అవును ఇష్టమైతేసరి అల్లాగే ఉంటుంది. వాడు అంత మంచివాడేం ఈ రోజునుంచీ నీ వసలు నా కళ్ళకు కనపడ్డావంటే ప్రాణం తీస్తా. నీ మనస్సంతా ఎవడిమీదనో పెట్టుకుని నాతో బాగుంటున్నట్లుగా నటించుదా మనుకుంటున్నావు కాబోలు. అవన్నీ నాదగ్గర సాగవు. పో ముందు—అంటూ బయటకు నెట్టారు. నే నింకోగదిలోకి పోయి వెక్కి వెక్కి ఏడుస్తున్నాను.

ఏయ్ ఇట్రా...అన్నారు మళ్ళీ గద్దిస్తూ. నేను వెళ్ళకపోయినా వారైనా వచ్చేటట్లున్నారని నేనే మళ్ళీ ఆ గదిలోకి వెళ్ళాను, పెద్దపులి బోనులోకి పోతున్న మేకపిల్లలాగా.

[సశేషం]



చిత్రకారుడు: శ్రీ బంకిం సర్కార్. శాంతినికేతనం